
nooreḷḷa





# అనువాదాన్ని భమిడిపాటివారి దగ్గర నేర్చుకున్నాను

## - పోరంకి దక్షిణామూర్తి

సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి పరిచయం చేయనవసరం లేని వ్యక్తి పోరంకి దక్షిణామూర్తిగారు. 40 కథలూ, మూడు ప్రాంతాల మాండలికాలలో మూడు నవలలు, ఇంగ్లీషు హిందీ భాష ల్లోంచి ముప్ఫయికి పైగా అనువాదాలు చేశారు. 'ఒకయోగి ఆత్మకథ' వీరి అనువాదమే! తెలుగు కథపైన 'కథానిక : స్వరూప స్వభావాలు' అంటూ మొట్టమొదటి సిద్ధాంత గ్రంథం వెలువరించారు. ఇప్పటికీ ఈ పుస్తకం యువరచయితలకు దిక్సూచిలా ఉపయోపగడుతోంది. 'మాండలిక వృత్తిపదకోశం - మేదర పరిశ్రమ, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు' వీరి సంపాదకత్వంలో వచ్చాయి. తెలుగు సాహిత్యానికి భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న పోరంకి దక్షిణామూర్తిగారితో ఇంటర్వ్యూ ఈవారం..

**తొమ్మిదో ఏట బడికి పోయాను**

మాది తూర్పుగోదావరి జిల్లాలోని ఆలమూరు. వరలక్ష్మి, సత్యన్నారాయణ మూర్తిగారు మా అమ్మా నాన్నలు. నేను 24 డిసెంబర్ 1935న పుట్టాను. మేం ఐదుగురం సంతానం. ఇద్దరు మగపిల్లలం, ముగ్గురు ఆడపిల్లలు. నేను ఆఖరు వాడిని కావడం వలన నేనంటే సహజంగానే ముద్దు ఎక్కువగా ఉండేది. నాకు తొమ్మిదో ఏడు వచ్చేదాకా బడికి పంపలేదు. మా ఊరికి మైలు దూరం ఊర్లోని స్కూల్‌కు నన్ను తొమ్మిదో ఏట పంపించారు. రోజూ పొద్దున్నే నడచుకుంటూ వెళ్లేవాడిని, మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి వెళ్ళేవాడిని. సెకండ్ ఫాం వరకూ అక్కడ చదువుకున్నాను.

**సైకిల్‌లో కాలు పెట్టేశా!**

మాకు ఆరుమైళ్ల దూరంలో ఉన్న మండపేటలోని స్కూల్లో థర్డ్‌ఫాంలో చేర్పించారు. నాకు సైకిల్ తొక్కడం రాదు. మా అన్న ఫ్రెండ్ ఒకతను ఉండే



కాళోజీ, వావిలాలతో....

వాడు. మేమిద్దరం ఒకే క్లాస్. అయితే అతను నాకన్నా బలంగా ఉండేవాడు. వయసులో కూడా నాకంటే పెద్దవాడు. మా సైకిల్ క్యారేజిలో నన్ను కూర్చోబెట్టుకుని అతను సైకిల్ తొక్కుతూ స్కూల్‌కు తీసుకెళ్ళేవాడు. ఒకసారి సైకిల్లో కాలు పెట్టాను. బాగా దెబ్బ తగిలింది. మూడు నెలలు ఇంటి దగ్గరే ఉండిపోయాను. ఇలా కాదని, మా నాన్నగారు నా చదువు కోసం రాజమండ్రిలో మకాం పెట్టారు. అక్కడి 'వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాల'లో ఎస్.ఎస్.ఎల్.సి. వరకు చదువుకున్నాను. అక్కడ ప్రసిద్ధ కవులు, రచయితలు మాకు టీచర్లుగా ఉండేవారు. ఈనాడు యూనివర్శిటీలో ప్రొఫెసర్లు కూడా చేయని పని ఆనాటి బడి టీచర్లు, కాలేజీ లెక్చరర్లు చేసేవారు. 'ఆంధ్రపురాణం' రాసిన మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు, బులుసు సీతారామ శాస్త్రిగారు మాకు తెలుగు నేర్పుతుండేవారు. భమిడిపాటి కామేశ్వరరావుగారు ఎస్.ఎస్.ఎల్.సిలో మాకు ఇంగ్లీషు చెప్పారు.

**ఆయన చెప్పిన పాఠాల స్ఫూర్తితోనే..**

నేను ఫోర్త్ ఫాం లో ఉండగా 'టేల్స్ ఫ్రం షేక్స్‌పియర్'ను తెలుగులో అనువాదం చేయమని భమిడిపాటి కామేశ్వరరావుగారు చెప్పారు. క్లాసులో అందరూ అనువాదం చేసి ఆయన టేబుల్‌పైన పెట్టాం. దానిని అనువాదం చేసిన వారిలో చివరివాడిని నేనే. భమిడిపాటిగారు నా అనువాదం చూసి 'హోటల్లో పెసరట్టు మరియు ఉప్మా తిన్నాను. రాముడు మరియు లక్ష్మణుడు అడవికి వెళ్లారు అని మాట్లాడం కదా. మనం రాసేది కూడా సహజమైన భాషలో ఉండాలి' అన్నారు. అప్పటినుంచీ నేను పరీక్షల్లో తప్ప మరెక్కడా గ్రాంథికం రాయలేదు. 1954నుంచి ఇప్పటి వరకూ నేను అనువాదాలు చేస్తున్నానంటే, ఆనాడు ఆయన దగ్గర పాఠాలు నేర్చుకున్న స్ఫూర్తితోనే!

**పొలంగట్లమీద కూర్చుని కబుర్లాడుకునే వాళ్ళం..**

రాజమండ్రిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మా వీధి చివర్లో ఉండేవారు. భమిడిపాటిగారు, మధునాపంతులగారు, కవికొండల వెంకటరావుగారు పక్కపక్క వీధుల్లో ఉండేవారు. కనక్‌ప్రవాసి, ఉషశ్రీ, ప్రసన్న, నిమ్మగడ్డ సుబ్బారావు లాంటి మిత్రులు ఉండేవారు. మేం రోజూ పొలం గట్లమీదో, గోదావరి కాలవగట్టుమీదో, మామిడి తోటల్లోనో కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్లం. ఎవరైనా కథ రాస్తే అక్కడ చదివి వినిపించేవారు, ఆ కథపైన వాడి వేడిగా చర్చించేవారు. అవన్నీ కూడా నన్ను కథారచన పట్ల ప్రోత్సహించాయి. 1950నుంచే ఏవేవో రాస్తుండేవాడిని. వాటిని తిరిగి చింపేసేవాడిని. అవన్నీ తెలిసీ తెలియని రాతలు. 1954లో వ్యాసాలు రాయడం మొదలు పెట్టాను. అప్పట్లో కోఠి పేవ్‌మెంట్ మీద జాన్ కాలియర్ షార్ట్‌స్టోరీ ఒకటి దొరికింది. దానిని చదివి 'ప్రేమ సుధ' అని ఓ కథరాశాను. అది అనువాదమో, అనుసరణమో మరి! ఆ కథ 1956లో 'తెలుగు స్వతంత్ర'లో అచ్చయింది.

**నాలుగు మార్కులతో హిందీ పోయింది**

ఎస్.ఎస్.ఎల్.సి. అయిపోయాక మిత్రులు కాకినాడలో ఇంటర్‌లో చేరారు. వాళ్లను చూసి నేను కూడా కాకినాడలో చేరాను. మొదటి సంవత్సరం హాస్టల్లో ఉండి చదివాను. 1951లో ఆంధ్ర అభ్యుదయ ఉత్సవాలు జరిగాయి. గిడుగు సీతాపతి, శ్రీశ్రీ లాంటివారు వచ్చారు. కొందరు గెస్టులు బంధువుల ఇళ్లలో దిగారు. శ్రీశ్రీ నా గదిలో ఉన్నారు. ఆయనకు నా మంచం ఇచ్చేసి నేను కింద పడుకున్నాను. కాకినాడలో చేరడంతో ఒక్కసారిగా స్వేచ్ఛ లభించినట్లయింది. దాంతో సరిగా చదివేవాడిని కాదు. ఇంటర్‌లో నాలుగు మార్కుల్లో హిందీ పోయింది. ఒక ఏడాదంతా ఇంట్లో ఖాళీగా కూర్చున్నాను. తమాషా ఏంటంటే హిందీలో ఫెయిల్ అయిన నేను తర్వాత హిందీ నుంచి ఆరేడు పుస్తకాలు అనువాదం చేశాను. ఇంటర్ రెండో సంవత్సరం నా మకాం లాడ్జికి మారింది. స్నేహితునితో కలసి ఉండేవాడిని. సింగిల్ క్యారేజీ తెచ్చుకుంటే ఇద్దరం తినే వాళ్లం. ఇద్దరు ముగ్గురు మిత్రులు వచ్చినా అదే భోజనం. అంతే! మిత్రుల కబుర్ల ముందు ఆకలి, దాహం తెలిసేవి కావు.

**సముద్రం ఎప్పుడూ కొత్తగానే కన్పిస్తుంది**

నేను రాజమండ్రిలో బి.ఏ. చదువుతున్న రోజుల్లో(1954-56) డిబేటింగ్‌లో పాల్గొనడానికి విశాఖపట్నం వెళ్లాం. ఎ.వి.ఎన్. కాలేజీలో డిబేటింగ్ ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి ఐదు నిముషాలు సమయం ఇచ్చారు. నేను నాలుగు నిముషాలు మాట్లాడాను. మాట్లాడుతున్న వాడిని ఎందుకో తలతిప్పి కిటికీలోంచి చూశాను. ఎదురుగా సముద్రం. పెద్దగా అలలు. దాంతో నాకు మాటలు ఆగిపోయాయి. సముద్రాన్ని అలా చూస్తూ ఉండిపోయాను. సముద్రం చూడ్డం నాకు కొత్త కాకపోయినా, అదేమిటో ఎప్పుడు చూసినా సముద్రం నాకు కొత్తగానే అన్పిస్తుంది. నేను ఒక్క నిముషం మాట్లాడక పోవడంతో మేం రన్నరప్‌గా నిలిచాం.

**100 రూపాయలతో రైలెక్కి హైదరాబాద్ వచ్చేశాను**

మా నాన్నగారు నా చిన్నప్పుడే ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యారు. అప్పటికి ఆయనకు 60 రూపాయల పెన్షన్ వచ్చేది. నా చిన్నతనంలోనే మా ఆస్తులన్నీ హరించుకుపోయాయి. మా స్వంతూరిలో ఇల్లు మాత్రమే మిగిలింది. మేము రాజమండ్రిలో అద్దెకు ఉండేవాళ్లాం. 1957 ఆగస్టులో డిగ్రీ రిజల్టు వచ్చాయి. నేను బి.ఏ. పాసయ్యాను. మా ఊరి షావుకారి వద్ద 100 రూపాయలు తీసుకుని ఉద్యోగం కోసం రైలెక్కి హైదరాబాద్ వచ్చేశాను. ఆ అప్పు నాన్నగారు తీర్చుకున్నారు. హైదరాబాద్‌కు వచ్చిన మూడు నెలల్లో ఎస్.బి.ఐ.లో క్యాషియర్ ఉద్యోగం వచ్చింది. అప్పటికింకా ఆంధ్రప్రదేశ్ ఏర్పడలేదు.

పోతుకూచి సాంబశివరావుగారు 'నవ్య సాహితీ సమితి' సమావేశాలు నడిపేవారు. నేనూ ఆయనతో పాటు కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. సినారె, దేవులపల్లి, దాశరథి లాంటి వాళ్లనంతా మా సమావేశాలకు పిలిచే వాళ్లం. హైదరాబాద్ వచ్చాక ఇక్కడ ప్రసిద్ధులయిన వారిని కలవడం, వారి రచనలు చదవడంతో సాహిత్యాభిమానం గాఢమయింది.



శ్రీమతి వరలక్ష్మితో....

## తెలుగు కథలపై మొదటి పి.హెచ్.డి. నాదే!

1960లో హైదరాబాద్‌లో అఖిలభారత మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా ఎగ్జిబిషన్ కూడా పెట్టారు. అప్పట్లో నేను తెలుగులో ప్రాంతీయ జానపద మాండలికంలో 'వెలుగూ వెన్నెలా గోదారీ' అనే నవల రాశాను. దానిని నండూరి రామమోహనరావుగారు విజయవాడకు తీసుకెళ్ళారు. ఆయన దగ్గర నుంచి తర్వాత నాకో ఉత్తరం వచ్చింది. అందులో 'మీరు రాసిన భాష మామూలుగా పుస్తకాలు చదివేవాళ్ళకు అర్థం కాదు. మీరు రాసిన భాష మాట్లాడేవాళ్ళకు చదవడం రాదు' అంటూ రాశారు. తర్వాత అదే నవలకు 1961లో ఆంధ్రప్రభ వారు నిర్వహించిన నవలల పోటీలో ద్వితీయ బహుమతి వచ్చింది. నేను చిన్నగా ఉన్నప్పుడు మా పాలేరు నన్ను రోజూ పొలం వద్దకు తీసుకుని వెళ్లేవాడు. అతనికి చదువు లేదు. అతను నాతో మాట్లాడుతూనే ఉండేవాడు. అతనిలాగా నేను మాట్లాడలేకపోవచ్చు గానీ, అతని మాటలను రాయగలను. ఈ నవల రాయటానికి అది ఉపయోగపడింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు వృత్తి పదకోశాల తయారీ చేపట్టారు. అందులో నేను కూడా పనిచేశాను. 'చేనేత వృత్తి పదకోశాలు' తయారీకోసం నన్ను ఫీల్డ్ వర్క్‌కు పంపారు. దానికోసం మహబూబ్ నగర్ జిల్లాలో కొంతకాలం ఉన్నాను. చాలామంది చేనేత వృత్తివాళ్లతో మాట్లాడాను. ఆ అనుభవంతో తెలంగాణ జానపద మాండలికంలో తొలినవల 'ముత్యాల పందిరి' రాశాను. కొంతకాలం పాటు ఉద్యోగానికి సెలవు పెట్టి కడపజిల్లాకు వెళ్ళాను. అక్కడ వారిని అధ్యయనం చేసి వారి మాండలికంలో తొలి నవల 'రంగవల్లి' రాశాను. ఆ రకంగా మూడు ప్రాంతాల మాండలికాలలో వచ్చిన మొట్ట మొదటి నవలలు నావే! వృత్తి పదకోశాల తయారీ సమయంలోనే ఎం.ఎ. చదివాను. 1963లో తెలుగు అకాడమీలో రికార్డ్ అసిస్టెంట్‌గా చేరాను. అక్కడ ఉద్యోగం చేస్తూనే 'కథానిక : స్వరూప స్వభావాలు' అనే అంశంపైన పిహెచ్‌డి చేశాను. తెలుగు కథలపైన వచ్చిన మొట్టమొదటి పిహెచ్‌డి అదే! నాకు సి.నారాయణరెడ్డిగారు సూపర్‌వైజర్.

## స్త్రీల సహకారమే లేకపోతే..

నాకు 17వ ఏట పెళ్లయింది. మా ఆవిడ పేరు కూడా మా అమ్మగారి పేరే, వరలక్ష్మి. మాకు ముగ్గురు పిల్లలు. అందరూ స్థిరపడ్డారు. నా సాహిత్య కార్యకలాపాలకు, ఉద్యోగ బాధ్యతా నిర్వహణకు భంగం కలగకుండానే, ఇంటికి సంబంధించిన పనులన్నీ ఆమే చూసుకునేది. అది నాకు చాలా అనుకూలమయింది. ఇంట్లో స్త్రీల సహకారం లేకపోయినట్లయితే ఎంత మహారచయిత అయినా తను అనుకున్న స్థాయిలో రాయలేడు.

## పురుష ద్వేషం శోచనీయం

అప్పట్లో అనుభూతి ప్రధానంగా కథలు ఉండేవి. ఇప్పుడు ఆలోచన ప్రధానమయిన కథలు వస్తున్నాయి. శిల్పంలో అప్పటికంటే ఇప్పుడే అభివృద్ధి ఎక్కువ, నిశితత్వం ఎక్కువ. ప్రయోగాలు కూడా చాలా ఎక్కువగానే వస్తున్నాయి. భాష కూడా చాలా పొదుపుగా వాడుతున్నారు. యింతకు పూర్వం సామాజిక స్థితిగతుల్లోను, వ్యక్తుల మనసుల్లోను వెలుగు చూడని అనేక కోణాలు, విషయాలు, సమస్యలు, భయాలు, బాధలు, పరిష్కార అవకాశాలు యిప్పటి కథల్లో చాలా కన్పిస్తున్నాయి. ఇది చాలా సంతోషించదగ్గ విషయమే! కానీ, ఇటీవల కాలంలో స్థూలంగా నేను గమనించినంత మటుకు రాజకీయ, ప్రాంతీయ, కుల, మత, వర్గ ప్రయోజనాలకే ప్రాముఖ్యం ఇచ్చి కథా ప్రక్రియను ఆ ప్రయోజనాల ప్రచార, ప్రసారాలకు సాధనంగా వినియోగించుకుంటున్నారు. స్త్రీలు, దళితులు,అల్ప సంఖ్యాక వర్గాల వారు తమ కష్టాలను తొలగించుకోవాలి, సుఖంగా జీవించాలని కోరుకోని వారు ఎవరూ లేరు. వాళ్లని అణచి వేయాలని, వ్యతిరేక దృష్టితో చూడాలని ఎవ్వరూ అనరు. సహృదయతతోనే వాళ్ల సమస్యలు పరిష్కరించడానికి, తగిన పరిస్థితులు ఏర్పడ్డానికి అనుకూలంగా చాలా రచనలు వచ్చాయి.

పురుషుల పట్ల వ్యతిరేకత, పురుష ద్వేషం కొట్టొచ్చినట్టు కనిపించేలా వెనకటి కాలంలో ఏ రచయిత్రీ రచనలు చేయలేదు. ఇప్పటి రచయిత్రులు పురుష ద్వేషులమని చెప్పకపోయినా, పురుష ద్వేషులం కామని అన్నా వారి రచనల్లో మాత్రం ఈ ధోరణి కన్పిస్తోంది. ఇది చాలా శోచనీయం.

ప్రపంచంలో అన్ని దేశాల్లోను గౌరవం పొందిన రామాయణ, మహాభారతాలను తదితర గ్రంథాలను నిశితంగా అధ్యయనం చేసినట్లయితే, సమాజంలో మనిషి తాను సుఖంగా జీవించడానికి, యితరులు సుఖంగా జీవించేటందుకు తోడ్పడ్డానికి పూనుకుంటాడు. కేవలం ఇతర భాషా సాహిత్య ప్రభావంతో, పాశ్చాత్య సిద్ధాంతాల మీద, ప్రభావ ధోరణుల మీదా ఉన్న భక్తితో జాతికి జీవనాడులైన విలువలను విస్మరించి, వాటిని పెంచే రచనలను విస్మరించి మానసికంగా విదేశీయులకు బానిసలు కావలసిన దుస్థితి రచయితలు పొందకూడదు. తాము స్వతంత్ర బుద్ధిని ఉపయోగించి మన దేశానికి గౌరవాన్ని పెంచే విధంగా, సార్వకాలికమైన విలువలను సంరక్షించే విధంగా చేసిన రచనలే నిలుస్తాయి. ప్రయోజనవంతమవుతాయి. అలా కానివి పనికిమాలినవి.

**- సుంకోజి దేవేంద్రాచారి**

### నచ్చినవి

కథకులు : చాలామంది
కవి : దేవులపల్లి కృష్ణశాస్త్రి
నవల : మాలపల్లి
సినిమా : మల్లీశ్వరి
పాట : మల్లీశ్వరిలో భానుమతి పాడిన పాటలన్నీ
నటి : అంజలీదేవి
నటుడు : బళ్ళారి రాఘవ
గాయని : లతామంగేష్కర్
గాయకుడు : మంగళంపల్లి బాలమురళీకృష్ణ
వంట : బొబ్బట్లు
మనిషి : ఏదో ఒక విషయానికి నాకు నచ్చని వ్యక్తి లేడు.

నాకు నచ్చిన నా కథ

# చంద్రవంక

- పోరంకి దక్షిణామూర్తి

చంద్రవంక పొంగింది!
కట్టలు తెంచుకు పారింది
చరచరా సాగుతూ ఊరంతా నిండింది.
ఎక్కడ చూసినా హాహాకారాలు, ఆర్తారావాలు. ఊరు ఊరంతా గగ్గోలెత్తిపోయింది.
మాచెర్ల చెన్నని ఆలయ ప్రాంగణంలో, మడిబట్ట కట్టుకొని మౌన ముద్రలో కూర్చున్న మంగయ్య శాస్త్రి కళ్ళు విప్పి చూశాడు.



ఆలయ ప్రాంగణమంతా అంతులేని జల సముద్రం అయిపోయింది.

హోరున వర్షం పడుతూంది.

మంగయ్యశాస్త్రి గుండె కుదేలయిపోయింది! ఒక్క ఉదుటన లేచి మంటపం నలుమూలలకీ చూశాడు. మనమడు ఏమైపోయాడోనని మనస్సు విలవిల్లాడిపోయింది.

మనమడు చిన్న మంగయ్యశాస్త్రి – మంటపానికి వెనకతట్టున నీటిని చెదరగొడుతూ ఆడుకుంటున్నాడు.

అతనికి ప్రాణం లేచి వచ్చింది.

''బాబూ! ఇక్కడున్నావురా? ఇంటికి పోదాం, రా బాబూ!'' అంటూ వాణ్ణి దగ్గిరకి తీసుకోబోయాడు.

చిన్నవాడు తాతచేతులు తోసి పారేస్తున్నాడు. చుట్టూతా ఇంత నీటిని చూస్తూంటే వాడికి కన్నుల పండువుగా ఉంది. అరచేతులతో నీటిని చెదరగొడుతూంటే, తుంపరలు ముఖం మీదకి వచ్చి పడుతూంటే వాడికి ఎంతో కులాసాగా ఉంది. అందువల్లనే తాత చేతుల్లో నుంచి మళ్ళీ జారిపోయి నీళ్ళల్లో పడ్డాడు.

''బాబూ! వద్దు బాబూ! ఇంటికి పోదాం పద! అమ్మా, నాన్నా మనకోసం వెతుక్కుంటూ ఉంటారు'' అన్నాడు.

''ఇంటికొద్దు తాతా! నాకిక్కలే బావుంది!'' అన్నాడు వాడు, వచ్చీరాని మాటలతో.

చిన్నవాడి అమాయికత్వానికి నవ్వుకోవాలో, వచ్చిపడ్డ ఆపదకి బాధపడాలో తెలిసింది కాదు, మంగయ్యశాస్త్రికి.

హోరున వర్షం పడుతూనే ఉంది. మన్నూ, మిన్నూ ఏకమై, ప్రపంచంలోని విషాదమంతా కూడగట్టుకొని కురుస్తున్నట్టుంది.

ఇల్లు ఏ పరిస్థితిలో ఉందో, ఇంటి దగ్గిరివాళ్ళు ఏమైపోయారోనని దిగులెక్కువై పోతున్నది మంగయ్యశాస్త్రికి. ఇక ఉండబట్టలేక, మనమణ్ణి చటుక్కున లేవనెత్తుకుని ఆలయ మంటపం దిగి వచ్చాడు.

చెంపలు పగిలేటట్టు వర్షం జోరుగా కొడుతూంది. నాగేశ్వరస్వామి శిలాస్తంభం మీదకి నీరు పాకుతూ ఉంది.

పిల్లవాణ్ణి భుజం మీద పదిలంగా ఒత్తుకుని, చెన్నకేశవుల ఆలయ ప్రాంగణపు దక్షిణ వైపు వాకిలి దాటి శివాలయం దగ్గిరికి వచ్చేసరికి రాయి తగిలి తూలబోయాడు. కాని, మంటపం అరుగుకు దగ్గిర పాతి ఉన్న నిలువురాతి మీద చెయ్యి ఆనుకుని కాలు నిలదొక్కుకున్నాడు. 'కన్నాడ పోతినేని – మూరొ' అన్న అక్షరాలూ, కింద మూరెడు పొడుగు నిలువు గీతా అంత వర్షంలోనూ కూడా అవుపిస్తున్నాయి. మళ్ళీ వెలుపలి ద్వారం వైపుకు నడిచాడు.

వర్షం అంతకంతకు పెరుగుతూనే ఉంది.

పోతూ పోతూ వీరభద్రస్వామి వైపు దీనంగా చూశాడు. ద్వారం ఇవతల పతనావస్థలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి ముందు ఒక్క క్షణం ఆగి చేతులు జోడించాడు.

''స్వామీ! నువ్వు ప్రత్యక్షదైవానివి! ఈ దీనుణ్ణి కరుణించు స్వామీ!'' అని వెలుపలి ద్వారం దాటి నడిచాడు.

ఊరంతా జవజవలాడిపోతున్నది!

బయట ఉన్న శిలాస్తంభం కదలలేక స్థాణువై నిలుచుంది. కేశవస్వామి ఊరేగింపు రథం ఒక్క అడుగుకూడా ముందుకు జరగలేక పోయింది. చుట్టూ హాహాకారాలు అంతకంతకు ఎక్కువయ్యాయి. ఊళ్లో జనమంతా సామానులు ఎత్తుకొస్తూ మిద్దెల మీదకి చేరవేసుకుంటున్నారు. కొందరు నడికొప్పులెక్కి ముడిచిపెట్టుకొని కూర్చున్నారు. వాళ్ళ పక్కనే పిల్లా పాపలతో ఆడవాళ్ళు పైకి చేరుకుంటున్నారు. కొందరు దూళ్ళగడ్డి కూడా పైకి చేరవేస్తున్నారు. మరికొం దరు దూడలనే మిద్దెలెక్కిస్తున్నారు. ముసలివాళ్ళు ముక్కుతూ, మూలుగుతూ పక్కల కొరిగి పోతున్నారు. గర్భవతులు ఆపసోపాలు పడుతున్నారు. అక్కడ క్కడ ఒక్కటీ అరా తప్ప చెట్ల మీద పిట్టలు కూడా లేవు. ఊరు ఊరంతా జీవన్మ రణ సంధిలో అల్లాడిపోతున్నది.

మంగయ్యశాస్త్రి ఎంత తొందరగా ఇంటికి చేరుకోవాలనుకుంటున్నాడో అంత తొందరగానూ నీటి ఉరవడి పెరిగిపోతున్నది. అడుగుతీసి అడుగు వెయ్యటం కష్టమై పోతున్నది. కాలు ఒకవైపుకు వెయ్యబోతే నీటి విసురికి మరొ కవైపు పడుతున్నది.

అప్పటికప్పుడే పిల్లవాడికి కప్పిన అంగోస్త్రం తడిసి, ముద్దయింది. ఒకసారి గుడ్డ పిండి, మళ్ళీ వాడి ఒంటినిండా కప్పి, మెడకి ఎక్కించుకుని, భుజాల మీదకి వచ్చేటట్టు వాడి కాళ్ళు రెండూ చాపి ముందుకు నడిచాడు.

ముందుకు నడిచేకొద్దీ ప్రవాహానికి ఎదురెక్కొస్తున్నాడు. శరీరంలో శక్తి నంతా కూడదీసుకుని అడుగు ముందుకు వేస్తున్నాడు. ప్రవాహం నడుము దాకా పెరిగింది. ఇంకా ఊతంగా అడుగు వేస్తున్నాడు. ఇంతలో దభీమని చప్పుడు వినిపించింది. ఇందాకా ఒక ఇంటి నడికొప్పుమీద కనిపించినాయన కాలు జారి పడ్డాడు. అతన్ని పట్టుకోబోయిన ముసలాయన తలకిందులుగా పడి ప్రవాహంలో ఎటో కొట్టుకు పోయాడు! ఇంటి మీది నుంచి ఏడుపులూ పెడబొబ్బలూ వినిపిస్తున్నాయి. మంగయ్యశాస్త్రి ఆ వైపుకి చూడలేక 'శివశివా!' అని కళ్ళు మూసుకున్నాడు.

అడుగుతీసి అడుగేస్తున్నాడు. రెండు కోడి పెట్టలు ప్రవాహంలో పడి కొట్టు కొస్తూ సుడిగుండంలో గిరగిరా తిరిగి మునిగి పోయాయి. కుక్కపిల్ల ఒకటి కుయ్యో, మొయ్యోమని అరుస్తూ అతని పక్క నుంచే కొట్టుకు పోయింది. ఏ పాకలో ఇరుక్కు పోయిందో పాపం, ఆవుదూడ ఒకటి 'అంబా!' అని అరవడం వినిపించింది.

మంగయ్య శాస్త్రి గుండె చిక్కబట్టలేక పోతున్నాడు.

''ప్రభూ! జగద్రక్షకా! ఏమిటీ ప్రళయం! ఎందుకు నీకింత ఆగ్రహం? ఈ ఊరు ఊరంతా సర్వనాశనమవుతూ ఉంటే చూస్తూ ఎలా భరిస్తున్నావు స్వామీ!'' అంటూ విలవిల్లాడి పోయాడు.

మంగయ్యశాస్త్రి నడుస్తూనే ఉన్నాడు. భుజాల మీద మనమడు అలానే చూస్తూ కూర్చున్నాడు.

అతను ఇంటి దగ్గరికి వచ్చేసరికి నీటిమట్టం బొడ్డు దాటి పైకి వచ్చింది.

''తాతా! మన ఇల్లదుగో!'' అంటూ చూపించాడు మనమడు.

''ఔను బాబూ, వచ్చేశాం!'' అన్నాడాయన.

మంగయ్యశాస్త్రి ఇల్లు చంద్రవంక నోట్లో ఉన్నది. ఇటూ అటూ పూరిగుడిసె లున్నాయి. వాటి మీద జనం ఎక్కి కూర్చున్నారు. హోరున వర్షం పడుతూ ఉన్నది. ఇంటికి వెనకవైపున చంద్రవంక హోరెత్తిపోతున్నది.

ఇంట్లోవాళ్ళ అలికిడి వినిపించలేదు మంగయ్యశాస్త్రికి. వాళ్ళంతా ఏమై పోయారో తెలియటం లేదు!

అక్కడికీ, తనకీ మధ్య ఇరవై గజాల మేర నీరు ఉంది.

తనవాళ్ళు ఏమైపోయారో తెలియడం లేదు. ఈదుకుని వెళ్దామంటే భుజాల మీద పిల్లవాడున్నాడు. అక్కడే నిలబడదామంటే నీటి ఉరవడికి కాళ్ళు ఊగిసలాడి పోతున్నాయి. గుండె అదిరి అదిరి పడుతున్నది.



''పరమేశ్వరా! ఈ శరీరం నశ్వరం! దీన్ని ఏం చేసినా నీదే భారం తండ్రీ!'' అని, ఒక్క అడుగు ముందుకు వేశాడు. కాలికి ఏదో తగి లింది. ప్రాణం జిల్లార్చుకు పోయింది. మరొక అడుగువేశాడు. మెత్తగా ఏదో తగి లింది. తన కాలికింద పడినది మనిషి దేహ మయి ఉంటుందన్న ఊహ భరించలేక పోయాడు! వెనక్కు రాబోయాడు.

నీటిలో సుడిగుండం ఏర్పడి తనవైపే వడిగా వస్తున్నది. పిల్లవాణ్ని దక్కించుకోవా లన్న ఆతురత అతనికి ఎక్కువైపోయింది!

ముందుకు నడిచాడు. తన ఇంటి తలు పులు రెండు ఊడి కొట్టుక పోతున్నాయి! పూల సజ్జ కొట్టుకుపోతున్నది. శివుని పటం కొట్టుకుపోతున్నది. 'శ్రీ చక్రం' కొట్టుకు పోతున్నది. వ్యాసపీఠం కొట్టుకుపోతున్నది! రుద్రాక్షతావళం కొట్టుకు పోతున్నది.

మంగయ్యశాస్త్రి గుమ్మంలో అడుగుపె ట్టాడు. ఇంట్లో వాళ్ళంతా ఒక్కసారి గొల్లు మన్నారు! తన కొడుకూ, కోడలూ, కూతురూ, భార్యా నలుగురూ గోడకి అంటి పెట్టుకు పోయారు!

మంగయ్యశాస్త్రికి దుఃఖం ఆగింది



## వరద బీభత్సం

1964, సెప్టెంబర్ 30వ తేదీన, గుంటూరు జిల్లా మాచెర్ల పట్నంలో 'చంద్రవంక' అనే వాగు పొంగింది. చెరువులకు గండ్లు పడ్డాయి. ఊరు ఊరంతా జలసముద్రమై పోయింది. గంటకు సుమారు ఏభైమైళ్ళ వేగంతో ఊరంతటా నీరు సుళ్ళు తిరిగింది. అపారమైన ధననష్టం, కొంత జననష్టం సంభవించాయి. చెట్లు కూలిపోయాయి. భవంతులు ఒరిగిపోయాయి. ఆసుపత్రిలో మంచాలతో సహా రోగులు కొట్టుకు పోయారు. కృష్ణానదికి ఉపనదులైన నాగులేరూ, చంద్రవంకా 'పల్నాటి చరిత్ర'లో ఎన్నటికీ మరుపురానివి! వీటిలో ఒక వాగు తూర్పునుంచి పడమటికి ప్రవహిస్తూ, ఊరిచుట్టూ వంకెగా తిరుగుతుంది. అందుకే 'చంద్రవంక' అయింది. ఆ వాగు పొంగడం వల్ల జరిగిన బీభత్సాన్ని ఆధారం చేసుకొని రాసిన కథ ఇది.

**-పోరంకి దక్షిణామూర్తి**

**1-100, చైతన్యపురి, దిల్‌షుక్ నగర్**
**హైదరాబాద్-500060**
**ఫోన్: 040-24146205**

కాదు. అయినా కంట నీరు జారకుండా పిల్లవాణ్ణి గుండెల కొత్తుకున్నాడు.

''అమ్మా!'' అంటూ చేతులు చాచాడు పిల్లవాడు.

తడిసిన కళ్ళు ఎవరికీ కనబడకుండా మొహం పక్కకి తిప్పుకుంది తల్లి.

కొన్ని గదుల తలుపు రెక్కలు ఊడి కొట్టుకుపోతున్నాయి. మంగయ్యశాస్త్రి అలానే చూస్తూ నిలబడి పోయాడు. కొడుకు తల వంచుకున్నాడు. కోడలు కొంగు ముఖానికి అడ్డు పెట్టుకున్నది. కూతురు వెక్కి వెక్కి ఏడుస్తున్నది. ముసలావిడ ఈ విషాదానికి తట్టుకోలేక పోతున్నది.

కూతురు ఏడు మాసాల గర్భిణి. క్షణక్షణానికీ ఆమె గుండె బరువై పోతున్నది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు పట్లు తప్పిపోతున్నాయి. గొంతు పూడ్చుకు పోతున్నది.

మరొక క్షణంలో ఆమెకళ్ళు మూతలుపడ్డాయి. మనిషి లోలోపలికి దిగజారి పోతున్నది. ఆమె పరిస్థితిని మొట్టమొదట గ్రహించినది ఇంటికోడలు. ''శారదా!'' అంటూ బిగ్గరగా అరిచి ఆమెను అందుకోబోయింది. అప్పుడే ఇంటి వెనకాల పెద్ద పిడుగు పడింది. రెండు కొయ్యబాదులు విసురుగా లోపలికి దూసుకువచ్చి, మంగయ్యశాస్త్రి కొడుకును దూరానికి నెట్టివేశాయి. అంతా క్షణంలో జరిగిపోయింది.

''చెన్నకేశవా'' బిగ్గరగా అరిచాడు మంగయ్యశాస్త్రి. ముసలమ్మ గారు కళ్ళు విప్పింది.

''ఏఁవండీ!'' అంటూ గుండెలు బద్దలు కొట్టుకుందా ఇల్లాలు. మంగయ్యశాస్త్రి గొంతు పూడుకు పోయింది.

పిల్లవాడు బిగ్గరగా ఏడుపు ప్రారంభించాడు.

''ఊరుకో బాబూ! ఊరుకో! నీకేం భయం లేదు! నేనున్నానుగా!'' అంటూ వాణ్ణి ఒక వైపున ఓదారుస్తున్నాడు. మరొకవైపున భార్యను దగ్గరికి తీసుకుని తల నిమురుతున్నాడు.

అంతవరకు తాను ఎవరిని చూసుకొని తృప్తిపడ్డాడో వాళ్ళు ముగ్గురూ ఇప్పుడు కంటికి దూరమై పోయారు. తనవాళ్ళు, తన రక్తం పంచుకున్న వాళ్ళూ - కొడుకూ, కూతురూ, కోడలు తన కళ్ళముందే నీట మునిగి కొట్టుకుపోయారు. ''పరమేశ్వరా! ఈ దుర్భర విషాదాన్ని కళ్ళార చూసేందుకే నన్ను బతకనిచ్చావా తండ్రీ!'' అంటూ వాపోయాడు.

పది కాలాలపాటు పచ్చగా ఉండవలసిన వాళ్ళంతా పోయి, ఎందుకూ పనికిరాని వాళ్ళూ తనూ, భార్యా ప్రాణాలతో ఉండడంలో అర్థం ఏమిటి? తరతరాలుగా వర్ధిల్లవలసిన ఈ వంశవృక్షం క్షణకాలంలో ఇలా కూలిపోవడంలో అర్థం ఏమిటి? ఈ వేదనా భారాన్ని భరించమని భగవంతుడు తనకెందుకు రాసి పెట్టాలి? తన తండ్రి శిష్టాచార సంపన్నుడు. క్రమాంతస్వాధ్యాయి. వైదిక నిష్ఠ చెదరకుండా, వ్రతదీక్షితుని మాదిరిగా జీవితం వెళ్ళబుచ్చిన వాడాయన. కాని, తన తరానికి ప్రపంచం మారింది. సత్యం, ధర్మం, శీలం అనేవి నిలబెట్టటం కోసమే వ్యక్తి జీవించాలనీ, అవే బతుక్కు ధ్యేయాలనీ విశ్వసించిన సమాజ మాయనది. ఆ వ్యవస్థ తన కాలానికి సడలింది. తాను తండ్రి అంత నిష్ఠగా, నిప్పులా బతికినవాడు కాకపోయినా, నాటి వ్యవస్థ ప్రామాణికతను ఎన్నడూ శంకించలేదు; కించపరచనూ లేదు. 'స్వధర్మే నిధనం శ్రేయః' అన్న సూక్తిని పాటించేందుకు యథాశక్తిగా ప్రయత్నిస్తూనే వచ్చాడు. కొడుకు పుట్టాడు. వాడికి ఉపనయనం చేశాడు. కాని నెల తిరగకుండానే వాడు గాయత్రీ మంత్రం మరిచిపోయాడు. ఈ ఊరొచ్చినప్పుడు తప్ప మెడ మీద జంధ్యం ఉంచుకుంటాడనే నమ్మకం లేదు. వీడి తరానికి వైదిక సంప్రదాయం పూర్తిగా భ్రష్టమైంది. తన కూతురు శారద ఉంది. కొడుకు ప్రోద్బలం మీద ఆమెను గుంటూరులో కాలేజీ చదువు వరకు చెప్పించాడు. అంతకంటే ఏం చేస్తాడు కనక? వేలకు వేలు కట్నాలు పోసి పెళ్ళి చేయలేని దరిద్రుడాయె! ఉన్న కాస్తంత భూమీ ఆ అమ్మాయి చిన్నతనంలోనే, వచ్చే పోయే బంధువుల్ని మేపటానికీ, దానధర్మాలకీ, ఇంట్లో శుభకార్యాలకీ, అడపా తడపా చేసిన అప్పులు పేరుకుపోగా వాటిని వదుల్చుకునేందుకూ క్రయపరచ వలసి వచ్చింది. మొత్తం మీద పెద్దలిచ్చిన ఇనాముల్నీ నేతిఘూరీ కొమ్ముల్లోంచి జారి పోయాయన్నమాట తన పట్ల రుజువయింది. ఏవో నాలుగు ముక్కలు ఒంట బట్టించుకుని పెద్ద పరీక్షలు ప్యాసయి, అన్నకు ఆసరా అవుతుందనుకున్న పిల్ల పరీక్షకు వెళ్ళడం మానేసి ఎవడో మతాంతరుణ్ణి పెళ్ళి చేసుకుంది. నాలుగు రోజులు తను చాలా బాధ పడ్డాడు. అయినా రక్తసంబంధం అన్నది తెంపుకుంటే తెగేది కాదు కనుక, మనస్సును సమాధానపరుచుకొని గంభీర హృదయం అలవరచుకొన్నాడు. కాని ఇల్లాలు అలా కాదు! తరతరాల సంప్రదాయం ఆమె మనస్సును సమాధాన పడనివ్వలేదు. ఆమె పరిస్థితి అంత అసహాయమైనది. కూతురు గుర్తుకు వచ్చినప్పుడల్లా అసహ్యించుకుంటూ ఉంటుంది. అటువంటి దాన్ని కన్నందుకు తనను తాను తిట్టుకుంటుంది. అయినా, శారదకు ఏడో నెల వచ్చిందని తెలిసే సరికి, మనస్సు నిలదొక్కుకోలేక, గుంటూరు వెళ్ళి, కూతుర్ని పురిటికి పుట్టింటికి తీసుకు వచ్చింది. తానెంతో తృప్తి పడ్డాడు.

ఇదీ మంగయ్యశాస్త్రి కుటుంబ పరిస్థితి. పతనమైన ఒకానొక వ్యవస్థ తాలూకు శిథిలావశేషం ఆ కుటుంబం! దాని భౌతికాంగాలు కూడా ఈనాడు అతని కళ్ళ ఎదుటనే ప్రవాహంలో పడి కొట్టుకుపోయాయి!

ఇక మిగిలినది తనూ తనమీదనే ఒరిగి ఉన్న ఇల్లాలూ, భుజాల మీద మనమడూ! ఏమిటి ఈ వైపరీత్యం? ఏమిటి, ఏమిటిదంతా?

ఈ ప్రశ్నలకు అంతు ఉండదు. వీటికి సమాధానాలు దొరకవు!

మంగయ్యశాస్త్రి మనస్సు పరిపరివిధాల పోతున్నది. ఈ విషాదకరమైన పరిస్థితిలో తన గుండె వెయ్యి వక్కలు ఎందుకు కాలేదో, బాధకు మారుగా ఆలోచన ఎందుకు రేగుతున్నదో అర్థం కావటం లేదు.

భార్య మహాలక్ష్మమ్మ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది. అప్పుడప్పుడు భర్త ముఖంలోకి చూస్తున్నది. ఏదో అడగాలనుకుంటుంది. నోరు పెకిలి మాట రాదు. చివరికి అడిగింది.

''ఏఁవండీ! ఏనాడో మనం చేసుకున్న పాపాలు నేటికి పండాయి కదా?'' అన్నది.

మంగయ్యశాస్త్రి మాట్లాడలేదు.

''ఏం? మాట్లాడరేం? మనం కన్నవాళ్ళే మనకి ఎదురు తిరగలేదూ? న్యాయం, ధర్మం, నీతి, నియమం ఏవీ లేకుండా బరితెగించి ప్రవర్తించడం లేదూ? అందుకే వచ్చింది ఈ విపరీతం! అందుకే వచ్చింది ఈ ప్రళయం! అంతేలెండి. లోకంలో ధర్మం ఎప్పుడు నశిస్తుందో అప్పుడే వినాశకాలం దాపురిస్తుంది. మహాప్రళయం వచ్చి అంతా తుడిచి పెట్టుకుపోతుంది. పోనీండి! అంతా నాశనమై పోనీండి! ప్రపంచమే భ్రష్టమైన తరవాత ఇంక ఏం ఉంటేనేం, లేక పోతేనేం?'' - అనాలనుకుంది మహాలక్ష్మమ్మ. కాని, గొంతు విడి మాటలు రాలేదు. ఆ ఉద్వేగం పట్టలేక బిగ్గరగా వెక్కి వెక్కి ఏడవటం ఆరంభించింది.

''ఎందుకే బాధపడతావ్. వెర్రిదానా! ప్రపంచంలో జరిగే వాటన్నిటికీ ఇలా

బాధపడుతూ ఉంటే ప్రయోజనం ఏముంటుంది? మనలో బలం ఉన్నంతసేపూ నిటారుగా నిలబడదాం! తరవాత ఏమన్నా జరగనీ! ఎలాగన్నా జరగనీ! బాధపడ్డం ఎందుకు చెప్పు!'' అంటూ అనునయించటం ఆరంభించాడు. ఆమె ఇదేదీ వినిపించుకోటం లేదు. తనలో తాను కుమిలిపోతున్నది. ఆమెను ఎలా ఓదార్చాలో ఆయనకి చేతకావటం లేదు. తనలో తనే సమాధానాలు చెప్పుకుంటున్నాడు...

ప్రపంచం అనేది మన చేతిలో ఇమిడే మట్టిబొమ్మ కాదు. రోజురోజుకీ అది పెరుగుతుంది, దూరం తరుగుతుంది. రోజు రోజుకీ ఎక్కడో అక్కడ మార్పు వస్తూ ఉంటూ ఉంటుంది. ఆ మార్పు మరికొన్ని మార్పులకు కారణం అవుతుంది. వాటన్నింటిని బట్టే మనిషి ఆలోచనలూ, నమ్మకాలూ, జీవిత విధానాలూ మారుతూ కొట్టుకు పోవచ్చు. వృక్షాలు ఒరిగిపోవచ్చు. భవంతులు కూలిపోవచ్చు. ఒక్కొక్క జాతి భూస్థాపితమే అయిపోవచ్చు. కనీ వినీ ఎరగనంత విషాదం ప్రపంచాన్ని ముంచెత్త వచ్చు. కాని ఆ వరదను మనం ఆపగలమా? దాని విసురు, మన బలాన్ని మించి పోయినప్పుడు తోటి వారితో మనమూ కొట్టుక పోక తప్పదు. ఇది మన కళ్ళ ఎదురుగా కనిపించే సత్యం! ఒకానొక కాలంలో, ఆనాటి సామాజిక పరిస్థితులను బట్టి కొందరు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. చాలామంది ఆ వ్యవస్థకు కట్టుబడి ఉన్నారు. క్రమక్రమంగా పరిస్థితులు మారుతూ వచ్చాయి. వాటి ఫలితాలు ఈనాటికి ప్రస్ఫుటంగా కనిపించాయి. ప్రతి ఒక్కడిలోనూ తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలన్న ఆతురత నానాటికీ ఎక్కువైంది. తన మంచి చెడ్డలూ నీతినియమాలు విధి బాధ్యతలూ తన ఇష్టమేనన్న అభిప్రాయం ఎక్కువైంది. మంచిదే. ప్రతి ఒక్కడికీ చిత్తశుద్ధి కలగాలనే మనం కోరుకోవలసింది!

''ఎందుకే ఇంకా ఏడుస్తావ్? కళ్ళు తుడుచుకో!'' అన్నాడు మంగయ్యశాస్త్రి భార్యవైపు తిరిగి.

''లేదు! నేను ఎందుకేడుస్తాను? అంతా నాశనమైం తరవాత, ఇంకా ఏం చూసుకుని ఏడుస్తాను?'' అన్నదామె.

''అది కాదే! నా మాట విను. ఒకచోట నాశనమైనది మరొకచోట కొత్త జన్మ ఎత్తుతుంది. దాని రూపంలో మార్పు రావచ్చు. కాని అదే చైతన్యం ఎప్పటికీ ముందుకు సాగుతూ ఉంటుంది. ఒకచోట రాలిన విత్తు ఇంకొకచోట కొత్తగా మొలకెత్తడం చూడలేదూ?'' అంటూ మంగయ్యశాస్త్రి ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. మహాలక్ష్మమ్మ ఇదేదీ వినిపించుకోటం లేదు. కళ్ళు మూసుకుని తనలో తాను మాట్లాడుకుంటున్నది.

తాతభుజాల మీద కూర్చున్న కుర్రవాడు, కాళ్ళకు నీళ్ళు అందాలని కిందకి జారబోయాడు.

నీటి మట్టం పైపైకి వస్తూనే ఉంది. నీళ్ళమీద తేలుతున్న సామాన్లు ఒక్కొక్కటే బయటకు కొట్టుకు పోతున్నాయి. మహాలక్ష్మమ్మ ఇవేవీ చూడడం లేదు. తనకీ ప్రపంచంతో సంబంధం లేదు. ఇంక వాటిని చూడటం కూడా దేనికి?

ఉత్తరవైపు గోడ కూలి భయంకరంగా చప్పుడైంది. ఆ వైపు పంచ ఒరిగిపోయింది. దూలాలు విరిగి పడ్డాయి. అన్నీ ముందుగదిలోకి ఒక్కసారి నెట్టుకొచ్చాయి. దభీదభీమని గోడల్ని గుద్దుకున్నాయి. నీళ్ళని చెదరగొట్టాయి. అంతా అల్లకల్లోలం చేసేశాయి!

''పరమేశ్వరా!'' అంటూ బిగ్గరగా అరిచాడు మంగయ్యశాస్త్రి. తరవాత ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

''తాతయ్యా'' అన్న పిలుపుకి మళ్ళీ కళ్ళు విప్పాడు.

తనని అంటి పెట్టుకొని ఉన్న మహాలక్ష్మమ్మ, ఇప్పుడు పక్కన లేదు.

అంత పెద్దవాడూ మంగయ్యశాస్త్రి, కంటి తడిని తుడుచుకోలేని పరిస్థితి.

''తాతయ్యా!'' అంటూ మళ్ళీ పిలిచాడు చిన్నవాడు.

మంగయ్యశాస్త్రి తల పైకెత్తాడు. మనమడు మిద్దెకింద ఉన్న కంతను చూపించాడు. అందులో ఒక తాటేకు బుట్ట ఉంది.

''నాకది ఇయ్యవా తాతయ్యా!'' అంటూ అడిగాడు చిన్నవాడు.

అంత విషాదంలోనూ మంగయ్యశాస్త్రి చిరునవ్వు నవ్వాడు. చెయ్యి చాపి, ఆ బుట్టను అందుకున్నాడు. అందులో ఉన్న తాటాకు పుస్తకాలు తీశాడు. ఒకటి వైద్యశాస్త్ర గ్రంథం. మరొకటి దశోపనిషత్తులు, ఇంకొకటి యోగశాస్త్రం. వేరొకటి భగవద్గీత. ఇంకొకటి మేఘ సందేశం, బ్రహ్మసూత్రాలు!

''బాబూ! ఇవి పుస్తకాలురా!'' అన్నాడు మంగయ్యశాస్త్రి.

''నాక్కావాలి తాతయ్యా!'' అన్నాడు చిన్నవాడు.

''కావాలా బాబూ! తప్పకుండా ఇస్తాను! ఇవన్నీ నీ కోసం దాచినవే నాయనా!'' అంటూ మంగయ్యశాస్త్రి, తన యజ్ఞోపవీతం తీసివేసి, ఒక వైపు కొస పుస్తకాల బుట్టకు చుట్టి, మనమణ్ణి బుట్టలో కూర్చోబెట్టి, రెండో వైపు కొస వాడి భుజానికి తగిలించి, ప్రవాహం వైపు విడిచాడు.

చిట్టచివరి సారిగా మంగయ్యశాస్త్రి మనుమడివైపు చూసి కళ్ళు మూసుకున్నాడు. ఆ క్షణంలోనే ఆయన 'ఆత్మసన్యాసం' స్వీకరించాడు.

''ప్రభూ! ఇదంతా నీ సంకల్పం! దీన్ని కాదనగల అతిశయం నాకు ఎప్పుడూ లేదు! కాని, చిట్టచివరిసారిగా నిన్ను కోరేది ఒక్కటే స్వామీ! ఈ చిన్న మొలకను ఎక్కడికయినా సురక్షితంగా చేర్చి కాపాడు తండ్రీ! విశాలమైన ఈ ప్రపంచంలో ఎక్కడయినా సరే, ఎవరయినా సరే, మనిషి మనిషిగా బతికేటట్లు చూడు స్వామీ! ఇది నా జాతి, నా మతం, నా రక్తం అన్న అహంభావం మనిషికి కలగనియ్యకు. ఆత్మవిశ్వాసం మాత్రం రగుల్కొల్పు! వ్యవస్థ ఏదయినా నాకు బెంగలేదు? వ్యక్తి నిటారుగా నిలబడగలిగితే చాలు! జీవిత విధానం ఎలా మారినా నష్టం లేదు; విలువలు మాత్రం నశించనియ్యకు తండ్రీ! ఇంతే చాలు నాకు. ఇదొక్కటే నిన్ను కోరేది!'' అని, రెండు చేతులూ జోడించి రెప్పలు వాల్చి, లోచూపులు నిగుడ్చుకొన్నాడు.

చంద్రవంక ఇంకా పొంగుతూనే ఉంది!

*

*కలకత్తా ఆంధ్ర సంఘం వారి ద్వాదశ వార్షిక సంచిక* ***1965***



## ఇంద్రన్‌ని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టిన రంభ!

తెలుగు హీరోయిన్ రంభ తాను స్వీట్ సిక్స్‌టీన్‌లోనే ఉన్నానని భ్రమపడుతోంది. తనకు ఇంకా పెళ్లి వయసు రాలేదంటూ గారాలు పోతోంది. ఇండస్ట్రియలిస్ట్ ఇంద్రన్ పద్మనాభన్, రంభ త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నారంటూ వచ్చిన వార్తలను పూర్తిగా కొట్టేయకపోయినా, తనకు ఏమంత వయస్సు మీరలేదనీ, పెళ్ళి చేసుకోవడానికి ఇంకా బోలెడంత వయసు ఉందని అంటోంది. ఇప్పుడు తన దృష్టి అంతా కెరీర్ మీదే ఉందనీ అంటూనే, ఇంద్రన్ నుంచి కోట్లాది రూపాయల విలువైన వస్తువులను బహుమతులను అందుకుంటోంది. పెళ్ళి చేసుకోవాలనే ఉద్దేశం తనకు ఉన్నా, అవకాశాలు వెల్లువలా వస్తుండడంతో పెళ్ళిని ప్రస్తుతానికి వాయిదా వేశానని అంటోంది. మరి గిఫ్ట్‌ల మాటేమిటి? అంటే, అవి అభిమానంతో ఇస్తున్నారనీ, వాటికి పెళ్ళికి లంకె పెట్టొద్దు అంటోంది. తనకు పెళ్ళి ఎప్పుడు చేయాలన్నది తన తల్లిదండ్రులకు బాగా తెలుసునని అంటోంది. అంటే...ప్రస్తుతానికి ఇంద్రన్‌ని వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టినట్టేనని ఆమె సన్నిహితులు అంటున్నారు.